


## 3వ మాట

**వాక్యమైయున్న యేసయ్య నామమునకు మహిమ కలుగును గాక!**

**మూలవాక్యము:- యోహాను 19:26,27 -** యేసు తన తల్లియు తాను ప్రేమించిన శిష్యుడును దగ్గర నిలుచుండుట చూచి అమ్మా, యిదిగో నీ కుమారుడు అని తన తల్లితో చెప్పెను తరువాత శిష్యుని చూచి యిదిగో నీ తల్లి అని చెప్పెను. ఆ గడియనుండి ఆ శిష్యుడు ఆమెను తన యింట చేర్చుకొనెను.

**ప్రవచనము:- నిర్గమ 20:12 -** నీ దేవుడైన యెహోవా నీకనుగ్రహించు దేశములో నీవు దీర్ఘాయుష్మంతుడవగునట్లు నీ తండ్రిని నీ తల్లిని సన్మానించుము.

**సిలువలో వ్రేలాడుతున్న యేసయ్య పలికిన మూడవ మాటను మనము ధ్యానము చేస్తున్నాము. ఈ మాట పలికేటప్పటికి యేసయ్య సిలువ యొద్ద యోహాను19:25 ప్రకారము ఆయన తల్లియు, ఆయన తల్లి సహోదరియు, క్లోపా భార్యయైన మరియయు, మగ్దలేనే మరియయు నిలుచున్నారు. ఆయన తల్లియు తాను ప్రేమించిన శిష్యుడును దగ్గర నిలుచున్నారు. మిగతా శిష్యులందరు చెదరిపోయియున్నారు.**

**మత్తయి 26:31 -** అప్పుడు యేసు వారిని చూచి ఈ రాత్రి మీరందరు నా విషయమై అభ్యంతరపడెదరు, ఏలయనగా గొఱ్ఱెల కాపరిని కొట్టుదును, మందలోని గొఱ్ఱెలు చెదరిపోవును అని వ్రాయబడి యున్నది గదా.

**జెకర్యా 13:7 -** ఖడ్గమా, నా గొఱ్ఱెల కాపరిమీదను నా సహకారి మీదను పడుము. ఇదే సైన్యములకధిపతియగు యెహోవా వాక్కు గొఱ్ఱెలు చెదరిపోవునట్లు కాపరిని హతము చేయుము, చిన్నవారి మీద నేను నా హస్తమునుంచుదును. ఇదే యెహోవా వాక్కు.

**మత్తయి 26:56 -** అయితే ప్రవక్తల లేఖనములు నెరవేరునట్లు ఇదంతయు జరిగెనని చెప్పెను. అప్పుడు శిష్యులందరు ఆయనను విడిచి పారిపోయిరి. **ఆ సమయములో తల్లియైన మరియ హృదయము ఖడ్గముచేత దూయబడినట్లుగా తల్లడిల్లిపోతోంది.**

**లూకా 2:35 -** మరియు నీ హృదయములోనికి ఒక ఖడ్గము దూసికొని పోవునని ఆయన తల్లియైన మరియతో చెప్పెను.

**సుమెయోను చెప్పిన ప్రవచనము మరియ జీవితంలో నెరవేరుతోంది. పురుషుని ఎరుగకుండా పరిశుద్ధాత్మ వలన గర్భము ధరించి, నవమాసాలు గర్భ వేదనను అనుభవించి, ప్రయాసముతో ప్రసవవేదనపడి కని పెంచిన కుమారుడు, అమానుషమైన శిక్షను భరిస్తూ ఉంటే, తన కళ్లెదుటే మూడు మేకుల చేత సిలువకు బిగించబడి రక్తము ధారలుగా కారుతూ ఉంటే, యెషయా 53:2 ప్రకారము సొగసు,సురూపము గల యేసయ్య తన సొగసును సురూపమును కోల్పోయి దేహమంతా మాంసపు ముద్దగా మారిన స్థితిలో ఉంటే ఆ తల్లి హృదయము ఎంత ఆవేదన చెందిందో , ఆమె ఎంతగా తల్లడిల్లిపోయిందో మనము మాటలలో వర్ణించలేము. మన పిల్లలకి చిన్న ముళ్ళు గుచ్చుకుంటే మనము భరించలేము. ఏదైనా అనారోగ్యము వచ్చినప్పుడు చిన్న సూదితో(ఇంజక్షన్ వేస్తే) దేహములో పొడిస్తే చూడలేము. బిడ్డలకంటే ముందు మన కళ్లవెంట కన్నీరు వస్తుందే, అలాంటిది ఏ తప్పు చేయని కుమారుడు ఆ దీన స్థితిలో ఘోరమైన,**




హీనమైన సిలువ మరణాన్ని అనుభవిస్తుంటే ఆ తల్లి ఎలా భరించిందో ఆలోచించడానికి మన జ్ఞానము సరిపోదు. అంతటి భీకరమైన పరిస్థితులలో కూడా యేసయ్య తన బాధ్యతలను విస్మరించలేదు. తల్లిదండ్రులను గురించి ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో, వారితో ఎలా మెలగాలో ప్రత్యేకించి వారి వృద్ధాప్యమందు వారిని ఎలా సంరక్షించాలో వాక్యములో తెలియజేసిన యేసయ్య సిలువలో తన బాధ్యతలను నెరవేరుస్తున్నారు.

పరిశుద్ధ గ్రంధంలో తల్లిదండ్రులకు ఒక ప్రత్యేక స్థానం ఉంది. పిల్లలు వారి పట్ల నిర్వర్తించాల్సిన బాధ్యతలు ఏమిటో దేవుని వాక్యములో గమనిద్దాం.

1. **సన్మానించాలి:** **నిర్గమ 20:12** - నీ దేవుడైన యెహోవా నీకనుగ్రహించు దేశములో నీవు దీర్ఘాయుష్మంతుడవగునట్లు నీ తండ్రిని నీ తల్లిని సన్మానించుము
2. **భయపడవలెను:** **లేవి 19:3** - మీలో ప్రతివాడు తన తల్లికి తన తండ్రికి భయపడవలెను. నేను నియమించిన విశ్రాంతిదినములను ఆచరింపవలెను; నేను మీ దేవుడనైన యెహోవాను.
3. **ఆనందపరచాలి:** **సామెతలు 23:25** - నీ తలిదండ్రులను నీవు సంతోషపెట్టవలెను నిన్ను కనిన తల్లిని ఆనందపరచవలెను.
4. **రక్షించాలి:** **1 తిమోతి 5:8** - ఎవడైనను స్వకీయులను, విశేషముగా తన యింటివారిని, సంరక్షింపక పోయినయెడల వాడు విశ్వాసత్యాగము చేసినవాడై అవిశ్వాసికన్న చెడ్డవాడై యుండును.
5. **దీవించాలి:** **సామెతలు 30:11** - తమ తండ్రిని శపించుచు తల్లిని దీవించని తరము కలదు.

   **సామెతలు 31:28** - ఆమె కుమారులు లేచి ఆమెను ధన్యురాలందరు చాలమంది కుమార్తెలు పతివ్రతాధర్మము ననుసరించి యున్నారు గాని వారందరిని నీవు మించినదానవు అని ఆమె పెనిమిటి ఆమెను పొగడును.

అయితే ఈ బాధ్యతలు నిర్వర్తించాల్సినటువంటి యుదా సమాజము, దేవుని కట్టడలను మరచి మనుష్యులు నియమించిన కట్టడలను , పితృపారంపర్యాచారములను దైవోపదేశములని బోధించుచు తల్లిదండ్రులను పూర్తిగా నిర్లక్ష్యము చేసారు.

**మార్కు 7:11,12,13** - అయినను మీరు- ఒకడు తన తండ్రినైనను తల్లినైనను చూచి నావలన నీకు ప్రయోజనమగునది ఏదో అది **కొర్బాను**, అనగా దేవార్పితమని చెప్పినయెడల, తన తండ్రికైనను తల్లికైనను వానిని ఏమియు చేయనియ్యక , మీరు నియమించిన మీ పారంపర్యాచారము వలన దేవుని వాక్యమును నిరర్థకము చేయుదురు. ఇటువంటివి అనేకములు చేయుదురని చెప్పెను.

నాటి సమాజము తల్లిదండ్రులను ఎంతగా నిర్లక్ష్యము చేసిందో యేసయ్యకు తెలుసు. గనుకనే వాక్యాన్ని నెరవేరుస్తూ, అక్కడ ఉన్న వారికందరికీ మరియు నేడు ఈ మాటను ధ్యానిసున్న మనకు కనువిప్పు కలిగేలా యేసయ్య తన మరణ సమయములో తల్లిని గూర్చిన బాధ్యతలను నెరవేరుస్తున్నారు.

మనము మన తల్లిదండ్రుల విషయములో ఏమి చేయకూడదో వాక్యములో గమనిద్దాం!

1. **దుఃఖము పుట్టించ కూడదు:** **సామెతలు 10:1** – జ్ఞానముగల కుమారుడు తండ్రిని సంతోషపరచును బుద్ధిలేని కుమారుడు తన తల్లికి దుఃఖము పుట్టించును.




2. **తిరస్కరించకూడదు: సామెతలు 15:20 –**జ్ఞానముగల కుమారుడు తండ్రిని సంతోషపెట్టును బుద్ధిహీనుడు తన తల్లిని తిరస్కరించును.
3. **దూషించకూడదు: సామెతలు 20:20 –** తన తండ్రినైనను తల్లినైనను దూషించువాని దీపము కారుచీకటిలో ఆరిపోవును.
4. **నిర్లక్ష్యము చేయకూడదు: సామెతలు 23:22 –** నిన్ను కనిన నీ తండ్రి ఉపదేశము అంగీకరించుము నీ తల్లి ముదిమియందు ఆమెను నిర్లక్ష్యము చేయకుము.
5. **తరిమివేయకూడదు : సామెతలు 19:26 –** తండ్రికి కీడుచేసి తల్లిని తరిమివేయువాడు అవమానమును అపకీర్తిని కలుగజేయువాడు.
6. **అవమానము తీసుకొని రాకూడదు: సామెతలు 29:15 -** బెత్తమును గద్దింపును జ్ఞానము కలుగజేయును అదుపులేని బాలుడు తన తల్లికి అవమానము తెచ్చును.

**Punishment:- సామెతలు 30:17 –** తండ్రిని అపహసించి తల్లి మాట విననొల్లని వాని కన్ను లోయ కాకులు పీకును పక్షిరాజు పిల్లలు దానిని తినును.

**సామెతలు 20:20 –** తన తండ్రినైనను తల్లినైనను దూషించువాని దీపము కారుచీకటిలో ఆరిపోవును.

**ద్వితీ21:18-21** ఒకని కుమారుడు మొండివాడై తిరుగబడి తండ్రి మాటగాని తల్లి మాటగాని వినకయుండి, వారు అతని శిక్షించిన తరువాతయును అతడు వారికి విధేయుడు కాక పోయినయెడల అతని తలిదండ్రులు అతని పట్టుకొని ఊరి గవినియొద్ద కూర్చుండు పెద్దల యొద్దకు అతని తీసికొని వచ్చి మా కుమారుడైన వీడు మొండివాడై తిరుగబడి యున్నాడు; మా మాట వినక తిండిబోతును త్రాగుబోతును ఆయెనని ఊరి పెద్దలతో చెప్పవలెను. అప్పుడు ఊరి ప్రజలందరు రాళ్లతో అతని చావగొట్టవలెను. అట్లు ఆ చెడుతనమును నీ మధ్యనుండి పరిహరించుదువు. అప్పుడు ఇశ్రాయేలీయులందరు విని భయపడుదురు.

**కుమారుడు తల్లిదండ్రుల మాట వినక, మొండివాడై వారిపైన తిరుగుబాటు చేస్తే పాత నిబంధన ప్రకారము వానిని రాళ్లతో చావగొట్టవలెను. నాడు, నేడు తల్లిదండ్రులు తమ బిడ్డలను కష్టపడి పోషించి, పెంచి, చదివిస్తున్నారు. పిల్లలను ఉన్నతస్థితిలో ఉంచడం కొరకు అనేక త్యాగాలను చేసి, తమ గురించి పట్టించుకోకుండా బిడ్డల క్షేమమే తమ క్షేమమని, వారి అభివృద్ధే తమ అభివృద్ధి అని యెంచి,బిడ్డలను ప్రయోజకులుగా చేయడం కోసం తమ జీవితాన్నే ధారపోస్తున్నారు. అయితే పిల్లలు పెరిగి పెద్దవారై ప్రయోజకులైన తర్వాత తల్లిదండ్రుల పట్ల తమ బాధ్యతలను నెరవేర్చకుండా వారిని అవమానిస్తున్నారు. దూషిస్తున్నారు. వారి అనారోగ్య పరిస్థితులలో నిర్లక్ష్యము చేస్తున్నారు. మరి కొందరైతే వారు అనాధలని చెప్పి వారిని వృద్ధాశ్రమాలలో చేర్పిస్తున్నారు. దౌర్భాగ్యము ఏమిటంటే నేడు క్రైస్తవ విశ్వాసులు, సేవకులు సహితము ఇలాంటి పాపకార్యాలు చేస్తున్నారు. యేసుక్రీస్తు సిలువలో పలికిన ఈ మాట అలాంటి వారందరికీ చెంపపెట్టు వంటిది. మరి ఈ మాటను ధ్యానిస్తున్న మనము మన తల్లిదండ్రుల విషయంలో ఎలా ప్రవర్తిస్తున్నాము. ఈ మాటలో అనురాగము, బాధ్యత నెరవేర్చుట ఉన్నట్లుగా చూడగలము పరిశీలించుకుందాం! పరీక్షించుకుందాం! సరిదిద్దుకుందాం! అలాంటి కృప దేవాది దేవుడు మనకందరికి దయచేయును గాక...ఆమేన్..ఆమేన్...ఆమేన్...**